# మీరూ ఆలోచించండి!



వంటిల్లు సర్ది, హాల్లో లైటార్పి బెడ్‌రూం లోకి వచ్చింది వందన. మంచంమీద దిండుకి చేరగిలబడి ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు విశ్వం.

"లైటు తీసేయమంటారా?" అడిగింది వందన. అతను సమాధానం చెప్పలేదు.

"మిమ్మల్నే, లైటార్పెయ్‌మంటారా?"

"చదువుకుంటున్నాను. కనబడ్డంలేదా..." ఆమెకేసి చిరాగ్గాచూసి అన్నాడతను.

దిండ్లు సర్ది. పక్కకి తొలగిన బెడ్‌షీట్ సరిచేసి మంచంమీద మేను వాల్చింది. అతను పుస్తకంలోంచి తల ఎత్తనేలేదు. అయినా అతని దృష్టి ఆ పుస్తకంలోని అక్షరాలమీద లేదని తెలుస్తూనేవుంది వందనకి. భర్త ఎందుకంత ముభావంగా వున్నాడో ఆమెకి అర్థం కావడంలేదు. మంచంమీదకి చేరగానే తమకంతో గాఢంగా కౌగిట్లో బంధించి వుక్కిరిబిక్కిరి చేస్తాడని, పదిరోజుల విరహాన్ని ఆ ఒక్క రాత్రిలో భర్తీ చేస్తాడని ఏవేవో తీయని వూహలతో పూర్ణించి వచ్చింది తను. పండక్కి పుట్టింటికి వెళ్ళి పదిరోజులుండి రావాలని బైలుదేరి వెళ్ళింది వందన. కానీ వారం రోజులకే భర్తమీదికి గాలి మళ్ళింది. అన్నా వదినలు అల్లరిచేస్తున్నా లెక్క చెయ్యకుండా మూడు రోజులు ముందుగానే తిరుగు ప్రయాణం కట్టింది. తను వస్తున్నట్టు టెలిగ్రాం కూడా ఇచ్చింది. సాయంత్రం భర్త స్టేషన్‌కి వస్తాడని ఎదురు చూసింది. అర్థగంట పైగా ఎదురు చూసినా అతను రాకపోయేసరికి తనే ఆటో మాట్లాడుకుని ఇల్లు చేరుకుంది. పక్కింటి వాళ్ళు తాళం చెవి తెచ్చిస్తే తలుపు తీసుకుని ఇంట్లోకి వచ్చింది. రాత్రి ఎనిమిది దాటేక వచ్చాడు విశ్వం.

"ఏవండీ... నా టెలిగ్రాం అందిందా?" అడిగింది.

"ఊఁ..."

"మరి స్టేషన్‌కి రాలేదేం. మీ కోసం ఎంతసేపు వెయిట్ చేశానో తెల్సా? ఎక్కడికెళ్ళారు?"

"ఎక్కడికీ వెళ్ళలేదు"

"మరి..."

"ఆఫీసులో అర్జంటు పని"

అన్నం వడ్డిస్తే ముభావంగా భోంచేశాడు. భోంచేసిన వెంటనే మంచమెక్కి పుస్తకం చేతిలోకి తీసుకున్నాడు. అప్పట్నించి చేతిలో పుస్తకం అలాగేవుంది.

పెళ్లయిన ఈ ఏడాదిలో ఏ రోజూ ఇంత నిర్లక్ష్యంగా ప్రవర్తించిందిలేదు భర్త తనవట్ల. భర్తకి కొంచెం దగ్గరగా జరిగింది వందన. సంకోచిస్తూనే అతని భుజంమీద చెయివేసింది.

"ఒంట్లో బాగోలేదా?"

అతను పలకలేదు.

"నా మీద కోపమా?"

"దయచేసి విసిగించకు. మాట్లాడకుండా పడుకోలేవూ?"

ఆమెచేతిని తనభుజం నుంచి తొలగిస్తూ అన్నాడు విశ్వం. దిండ్లు సర్దుకుని దూరంగా జరిగి పక్కకి తిరిగాడు. వందన నిట్టూర్చింది. తను కూడా పక్కకి తిరిగి ముఖంమీదికి దుప్పటి లాక్కుని పడుకుంది. ప్రయాణపు బడలికవల్ల కాసేపటికే నిద్రలోకి జారుకుంది.

ఉదయం నిద్ర లేచిన తర్వాతకూడా విశ్వం ముభావంగానే వున్నాడు. యాంత్రికంగా పనులు ముగించుకుని, టిఫిన్‌చేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు మామూలు టైమ్ కన్నా ముందుగానే.

ఇంటి పనంతా పూర్తి చేసింది వందన. టేబిల్‌మీద చిందరవందరగా పడివున్న పత్రికలు సర్దుతుంటే అప్పుడు కనిపించింది ఒక వుత్తరం. కవరు చింపి వుంది. ఉత్తరం బయటికితీసి తేదీ చదివింది. నాలుగు రోజుల కిందట విజయవాడ నుంచి తన పేరుకు వచ్చిన వుత్తరం అది.

"వందనా!

నమస్తే. ఎంతో ఆలోచించిన మీదట వేరే గత్యంతరం లేదనిపించి నీకీ వుత్తరం రాస్తున్నాను. వివాహమై నీవు వెళ్లిపోయిందగ్గర్నుంచీ అన్నయ్య చాలా మారిపోయాడు. ఎవ్వరితోటి మాట్లాడడు. ఒంటరిగా గంటల తరబడి తన గదిలో పేకెట్లకి పేకెట్లు సిగరెట్లు కాలుస్తూ శూన్యంలోకి చూస్తూ కూర్చుంటాడు. మొదట్లో మేమంతగా పట్టించుకోలేదు. ఏదోలే కొన్నాళ్ళుపోతే అంతా మర్చిపోయి వాడే స్థిమితపడతాడు అనుకున్నాం. అయితే ఇటీవల వాడి పరిస్థితి మరీ క్షీణించడం ప్రారంభించింది. మూడు నెలల నుంచి ఆఫీసుకి కూడా సరిగ్గా వెళ్ళడంలేదు. అసలే టెంపరరీ వుద్యోగం. ఏమై పోతాడోనని మాకంతా బెంగగావుంది. డాక్టర్లకి చూపించాము. శారీరకంగా ఏ జబ్బూ లేదని, ఒక రకమైన 'డిప్రెషన్'కి గురయ్యాడని అన్నారు. ఏవో మాత్రలు వాడమన్నారు. అయినా పెద్దగా గుణం కనిపించటంలేదు. నా కెందుకో నువ్వొకసారి వచ్చి అన్నయ్యతో మాట్లాడి వెళ్తే కొంత ప్రయోజనం వుండొచ్చని అనిపిస్తోంది. అందుకే సాహసం చేసి నీకీ వుత్తరం రాస్తున్నాను. ఇది నీ చేతికి అందుతుందనే ధైర్యం. ఒకవేళ మీ ఆయన ఇది చదవడం తటస్థించినా అర్థంచేసుకోగల సంస్కారం ఆయనకి వుంటుందనే నమ్మకం. ఉంటాను. వెంటనే బైలుదేరి వస్తావుకదూ!


ఇట్లు

—జయ

కథాచర్చ:

# అపశ్రుతి

**– జి. మల్లీశ్వరి**



ఉత్తరం చదవడం ముగించింది వందన. రాత్రి భర్త ప్రవర్తనకి ఇదన్నమాట కారణం. నిర్లిప్తంగా తనలోతాను నవ్వుకుంది.

• • •

ఎంత హుషారుగా, చలాకీగా వుండేవాడు నవీన్! ఆ హుషారు, చలాకీతనం వెనుక ఇంత బలహీనమైన మనస్సుంటుందని తనూహించలేదు. ప్రేమ కోసం వలలో పడటాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని ప్రేమ కోసం జీవితాన్ని నాశనం చేసుకునే వాళ్ళని చూస్తే అసహ్యం తనకి. విజయవాడలో బాబాయి వాళ్ళింట్లో వుండి తను బి.యస్సీ చదివేరోజుల్లో పరిచయమయ్యాడు నవీన్. సాహిత్యం గురించి, సినిమాల గురించి అనర్గళంగా మాట్లాడేవాడు. కృష్ణాబారేజి, కనకదుర్గ గుడి, గాంధీ హిల్సు—తమ పరిచయానికి, స్నేహానికి సాక్ష్యం పలుకుతాయి. స్నేహం ప్రేమగా మారడానికి ఎక్కువ కాలం అవసరం లేకపోయింది. పరీక్షలయ్యాక వివాహం చేసుకోవాలని కూడా తీర్మానించుకున్నారు. తండ్రి అడ్డు చెప్పకపోయినా తల్లి మాత్రం ఈ పెళ్ళి జరిగితే బావిలో దూకుతానని బెదిరించింది. ఆమె మొండితనం తనకి తెలిసిందే. అందుకే ఆమె తెచ్చిన సంబంధానికి తలవంచక తప్పలేదు వందనకి—

సాయంత్రం కావాలనే ఏదో సినిమాకి వెళ్ళి రాత్రి పది కావస్తుండగా ఇంటికి వచ్చాడు విశ్వం. వందన అన్నం వడ్డిస్తే మౌనంగా భోంచేశాడు. "నువ్వు భోంచేశావా?" అని భర్త అడుగుతాడేమోనని ఎదురుచూసింది వందన. అతను మాట్లాడకుండా చెయ్యి కడిగేసుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. మంచంమీద వాలి మళ్ళీ అదే పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నాడు. వందనకి మనస్సంతా కలచివేసినట్లయింది. అన్నం తినాలనిపించలేదు. గటగటా రెండు గ్లాసులు నీళ్ళుతాగి గదిలోకొచ్చింది. భర్త తననిలా మౌనంగా సాధించడాన్ని ఆమె సహించలేకపోయింది. కోపంతోనూ, దుఃఖంతోనూ ఆమె గుండెలెగిసి పడుతున్నాయి. అతని మంచానికానించి వున్న తన మంచాన్ని కొంచెం ఇవతలకి లాగి మేను వాల్చింది. అప్పుడయినా భర్త తలతిప్పి తనకేసి చూస్తాడనుకుంది. అయినా ఆమె వునికినే పట్టించుకోనట్టుగా అతను పుస్తకంలోంచి దృష్టి మరల్చనేలేదు. చదవడంలేదని మాత్రం తెలుస్తూనే వుంది. ఇక వుండబట్టలేకపోయింది వందన. చివాలున పడకనుంచి లేచి భర్త చేతిలోని పుస్తకాన్ని విసురుగా లాగేసింది.

"ఏమిటీ దౌర్జన్యం? బుద్ధిలేదూ!" అన్నాడు విశ్వం కసురుకుంటూ.

చివాల్న దిండు కిందనుంచి ఆ వుత్తరం తీసింది వందన. "ఇదేనా మీ ఈ ప్రవర్తనకి కారణం?" అంటూ విసురుగా ఆ వుత్తరాన్ని అతని చేతిలో పెట్టింది.

"ఇది నీకొచ్చిన వుత్తరం. నా చేతికెందుకివ్వడం?" అని దాన్ని ఆమె మీదికే విసిరేశాడు విశ్వం.

'ఎవరిదైతేనేం. నాకొచ్చిన వుత్తరాన్ని నా కంటే ముందే మీరే విప్పి చదివేశారుగా" ఆవేశంతో ఆమెకి మాటలు తడబడుతున్నాయి.

"ఆ మాత్రం అధికారం నాకుంది" కటువుగా అన్నాడు విశ్వం.

"మగ మహారాజులు. మీకు అన్ని అధికారాలూ వుంటాయి. పెళ్లయిన మర్నాటిరోజే మీ కాలేజీ ఆల్బం తెరచి అందులో మీరు పదిలంగా దాచుకున్న మీ గర్ల్ ఫ్రెండ్సు ఫోటోల్ని పేరు పేరునా భార్యకి పరిచయంచేసే అధికారం, విశాల హృదయం కూడా మీకుంది గుర్తుందా—"ఈమె రజని, ఈ అమ్మాయి థెరసా, ఇది సెన్‌బగం... తంజావురు పిల్ల. వీళ్ళంతా నేనంటే పడిచచ్చేవాళ్ళు. థెరసా అయితే మీదపడి కొరుక్కుతినేట్టుగా ప్రవర్తించేది. సెన్‌బగం దగ్గర్నించి ఇప్పటికీ నాకు వుత్తరాలు వొస్తుంటాయి ఆఫీసుకి'—అని ఎంత గొప్పగా చెప్పుకున్నారు ఆ రోజున మీరు...'

"మరి నువ్వెందుకు చెప్పలేదు... ఆ రోజున నీకూ ఓ ప్రియుడున్నాడని? ఎందుకు దాచాల్సి వచ్చింది?"

"చెప్పలేదు. భార్య కూడా పెళ్ళికి ముందు ఒకరిని ప్రేమించిందని తెలిస్తే ఆ ఆలోచననే మీరు భరించలేరు. భరించినా మీ పురుషాభిజాత్యం ఆ సంబంధాన్ని సవ్యంగా అర్థం చేసుకోనివ్వదు."

కాసేపు విశ్వం ఏమీ మాట్లాడలేదు.

"ప్రేమించిన వాణ్ణే ఎందుకు పెళ్ళి చేసుకోలేకపోయావు?" అడిగేడు భార్యకేసి సూటిగా చూస్తూ.

"అదే ప్రశ్న నేను వేస్తే? మగవాళ్ళు గనక మీ రెంతమందినైనా ప్రేమించవచ్చు. పెళ్ళి మాత్రం తల్లిదండ్రులు చూసిన 'బుద్ధిమంతురాలైన' అమ్మాయినే చేసుకోవాలి. ఆడది మాత్రం ప్రేమించిన వాడినే పెళ్ళాడాలి. లేకపోతే కలకాలం కన్యగానే అయినా వుండిపోవాలి. లేకుంటే ఎందులోనైనా పడిచావాలి. ఇదే మీ న్యాయం. అవునా?"

విశ్వం ఏదో అనబోయి ఆగిపోయాడు. ఆ చలిరాత్రి కూడా వుక్కబోస్తున్నట్టుగా అనిపించింది అతనికి. లేచి

మంచందిగి ఫేన్ ఆన్ చేసి వచ్చాడు.

"ఇంతకీ నువ్వు అతణ్ని ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?" అన్నాడు.

నిర్లిప్తంగా నవ్వింది వందన.

"ప్రేమించిన వాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకుంటే ఇన్ని కథలు, ఇంత సాహిత్యం, అసలీ సమస్యలే వుండకపోను."

"నేనడిగినదానికి ఇదికాదు సమాధానం" చిరాగ్గా అన్నాడు విశ్వం.

"నా సమాధానం అంత ముఖ్యం కాదు ఇప్పుడు."

"మూర్ఖంగా వాదిస్తున్నావు"

"మూర్ఖంగా ప్రవర్తించింది నేను కాదు. నేను వూర్నించి వచ్చిన వెంటనే నాకీ వుత్తరం సంగతి చెప్పి వివరాలడిగి వుంటే నేనెంతో సంతోషించేదాన్ని. కాని మీలోని అహం, అనుమానం మిమ్మల్నలా చెయ్యనివ్వలేదు."

"అధికప్రసంగం చేస్తున్నావు" అన్నాడు కోపంగా. ఆమె పలకలేదు.

"లైటు తీసెయ్" అని పక్కకి తిరిగి పడుకున్నాడు. లైటార్పి వచ్చింది వందన. ఆ చీకట్లో అతనికింకా ఏదో అడగాలని వుంది. తెలుసుకోవాలని వుంది. చాలాసేపు తటపటాయించి చివరికి అడిగాడు మెల్లగా.

"మీ ప్రేమ... సినిమాలు, షికార్ల వరకేనా లేక..."

పిచ్చి నవ్వొకటి నవ్వింది వందన.

"సెభాష్! చివరికి క్లైమాక్సుకి వచ్చారన్నమాట. ఆపేశారేం? అడగండి" అంది.

విశ్వానికి ఎందుకో వూపిరాడనట్లుగా వుంది. ఆమె ముందు పట్టుబడిపోయినట్టుగా, తేలిపోయినట్లుగా ఫీలయ్యాడు.

"షికార్ల వరకేనా లేక ఆ ఒక్కటీ కూడా జరిగిపోయిందా?—అదే కదూ మీ సందేహం?"

"గ్రహించావుగా చెప్పు" అన్నాడు కసిగా.

"చెప్పను" అంది తనూ అంత కసిగానే.

తన వ్యక్తిత్వం మీద ఎవరో ఛెళ్ళున కొట్టినట్లుగా అయింది అతనికి. పిడికిళ్ళుబిగించి బోర్లాతిరిగి పడుకున్నాడు. చాలాసేపటిదాకా ఎవరికీ నిద్ర పట్టలేదు.

### కథాచర్చ

రచయిత్రి పూర్తిగా రాసిన ఈ కథను ఒక ముఖ్యఘట్టంలో నిలిపివేశాము. ఆ తర్వాత ఏం జరిగిందనీ పాఠకులు వూహించి, ఆ ధోరణిలోనే కథను పూర్తిచేయాలి. రచన ఒక పేజీకి (అరఠావు సైజులో) మించకూడదు. విభిన్నమైన ధోరణిలో కథను ముగించినవారు లేదా రచయిత్రి ముగింపుకు దగ్గరగా రాసిన వారిలో అందరికంటే బాగా రాసిన పాఠకురాలికి పారితోషికం వుంటుంది. అటువంటి ముగింపురాసిన తక్కిన పాఠకుల పేర్లను ఆ శీర్షికలో ప్రకటిస్తాము.

ఈ కథా చర్చలో పాల్గొనడానికి ఆఖరుతేదీ జనవరి 4. రచనా వ్యాసంగంపట్ల ఉత్సాహం గల వారికి ఇదో చక్కని అవకాశం. త్వరపడండి.

## దాచేస్తే దాగని సత్యం:

# అమ్మకానికి అమ్మాయిలు

ఓకవంక స్త్రీ స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం అభ్యుదయ వాదులు ఆందోళన సాగిస్తున్నా వేరొకవంక జరిగే అమ్మాయిల అమ్మకాలు, సతిలాంటి అమానుష ఘాతుకచర్యలు జాతిని ఏవైపుకు తీసుకుపోతున్నాయా అన్న అనుమానం రాకమానదు. అమ్మాయిల అమ్మకం నేడు ప్రత్యక్ష వ్యాపారంగా మారిపోయింది. ఇది ఒక భయంకరమైన అంటువ్యాధిలా పల్లె పల్లెకూ వ్యాపిస్తోంది. కొన్ని ఊళ్లల్లో ఒక వర్గానికి చెందిన ప్రజలు ఈ వ్యాపారాన్ని కొనసాగించడానికి అనువైన స్థావరాన్ని ఎన్నుకొని ప్రజల్ని వారి పేదరికం ఆధారంగా దోచుకుంటూ దిగజారుస్తున్నారు. "మీ అమ్మాయిని అమ్ము హాయిగా బ్రతుకు" అనో లేక "రెండు మూడు సంవత్సరాలు నీ భార్యని బయటకిపంపు. బాగుపడ్తావు" అనో ప్రత్యక్షంగానే చెబుతున్నారంటే తెలియనివారు ఆశ్చర్యపోవచ్చు. నిజానికి ఆశ్చర్యపడవలసిన విషయం వీళ్ళని ప్రభుత్వం ఏమీ చేయ(లే)కపోవడమే. వెలుగులోకి రాని కేసులు అనేకం ఉన్నా తమకు తారసపడ్డ ఒకటి రెండు కేసులను ఈ స్త్రీ జాగృతి సంస్థ ('వేకప్') వెలుగులోకి తెచ్చింది.

పలమనేరుకు చెందిన సుల్తాన్ అనే వ్యక్తి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పదీ పదకొండు సంవత్సరాల వయసున్న ఆడపిల్లలను పనిమనుషులుగా సేకరించడం, గల్ఫ్ దేశాలకు వారిని ఎగుమతి చేయడం ఇటీవల బైటపడింది. వి.కోట మండలం తోట కనుమకు చెందిన ఓ పిల్ల తండ్రి ఆమెను చూడాలని 'సుల్తాన్' ఇంటికి వెళ్లగా ఆమెను మద్రాసులోని తమ బంధువుల ఇంటికి పనికి పంపినట్టు చెప్పాడు. పిల్లతండ్రి పట్టుబట్టి అడిగేసరికి అతన్ని మద్రాస్ తీసుకువెళ్లిమౌంట్ రోడ్‌లో వదిలి "ఇక్కడే మీ అమ్మాయి తప్పిపోయింది" అని చెప్పాడు. ఈ విషయాన్ని తండ్రి 1986 అక్టోబర్ మొదటి వారంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేయగా దానిపై ఎలాంటి చర్యా తీసుకోలేదని తేలింది.

మరోకేసు:

సాంబారపూరు గ్రామానికి చెందిన రామన్న కథనం ప్రకారం పదకొండు సంవత్సరాల కూతురు భానుమతిని ఓ మధ్యవర్తి ద్వారా సుల్తాన్ ఇంటికి పనికి పంపినట్టూ ఆమె సెప్టెంబరు రెండవ వారంలోనే మద్రాస్‌లో తప్పిపోయిందనీ తెలియజేసారు. అదేవిధంగా కొలమాసిన పల్లె నుంచి ఓ దిక్కులేని అమ్మాయిని ఆమెతో కలిసి వున్న అవ్వకు పెద్దమొత్తం ముట్టజెప్పి తీసుకువెళ్ళడం జరిగిందనీ ఐతే ఈ విషయం బైటికిరాలేదనీ, అదే సుల్తాన్ ద్వారా ఆమె కూడా అదృశ్యం కావడం జరిగిందనీ తెలుస్తోంది.

అయా తల్లిదండ్రుల రిపోర్టులను స్వీకరించిన సంస్థ నిజ నిర్ధారణ కమిటీ ఎన్నిసార్లు ప్రయత్నించినా సుల్తాన్‌ను కలుసుకోలేకపోయింది. కాని అతని కుమారుణ్ణి ప్రశ్నించగా అతడు మొదటి అమ్మాయి లేచిపోయిందనీ, రెండవ అమ్మాయి డబ్బుతో పారిపోయిందనీ, మూడవ అమ్మాయి విషయం తమకు ఏమీ తెలియదనీ బుకాయించాడు. "ఈ విషయమై నీవేం చర్య తీసుకొన్నావు?" అన్న ప్రశ్నకు సమాధానంగా అతడు 'పోలీసు రిపోర్టు ఇచ్చాము" అని జవాబిచ్చాడు.

మద్రాసులో అమ్మాయిలను వుంచిన ఇంటియజమాని పేరు ఇబ్రహీం అనీ, అతని భార్య పేరు షంషీర్‌బేగం అనీ, వారు ఆళ్వారుపేటలో నివసిస్తున్నట్టు కమిటీ కనుగొన్నది. వీరు చేసే వృత్తి గురించి ఎవరూ ఏమీ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారు. వీరు నివసించే ఇంటిదగ్గర అనేకమందికి గల్ఫ్‌దేశాల్తో సంబంధాలున్నట్టు దర్యాప్తులో తేలింది.

సుల్తాన్ డి.టి.కోగా పనిచేస్తూ బర్తరఫ్ చేయబడినట్టు అనేక అవినీతి కార్యక్రమాలు జరుపుతున్నట్టు, డబ్బు కోసం ఎంత నీచమైన పనిచేయడానికైనా వెనుదీయని వాడైనట్టూ స్థానిక ప్రజలు వెల్లడించారు. అమ్మాయిలను ఎగుమతి చేసిన డబ్బుతో ఇప్పుడొక పెద్ద భవంతి కడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు అమ్మాయిలను విదేశాలనుంచి వెనకకు తీసుకురావడానికి తమ చట్టాలు చాలవని అశక్తత వెల్లడించారు. దోషులను శిక్షించలేదు. ఇది శోచనీయం.

తెలుగు ఆడపడుచుల మాన ప్రాణాలను కాపాడటం తమ ధ్యేయంగా భావించే ప్రభుత్వం ఇకనైనా వీరికి గట్టి రక్షణ కల్పించి ఈ ఘాతుక చర్యలను అరికట్టాలని సంస్థ పత్రికల ద్వారా డిమాండ్ చేసింది. బట్టబయలైన ఈ విషయం ఆ ప్రాంతాలలో తీవ్ర ఆందోళన రేపింది. దాంతో సి.బి.ఐ. ఈ కేసు చేపట్టింది.

ప్రత్యక్ష వ్యాపారంగా మారుతున్న ఈ అమానుషచర్యలను ఇలాగే కొనసాగిస్తే జాతి పతనం తప్పదు అన్న సత్యాన్ని ప్రభుత్వం గుర్తించి దీనిని అరికట్టడానికి యుద్ధ ప్రాతిపదికపై సత్వరచర్యలు గైకొనాలి.

—ఎ.పుష్పాంజలి

['వేకప్' సౌజన్యంతో]